**జరిగిన కథ :** చింతామణి అనే వేశ్య.. లీలాశుకుని నుంచి దూరమైన తరువాత యోగినిలా బతుకుతుందేది. అగ్నిశిఖుడనే యోగిని ఆశ్రయించి, ఆత్మజ్ఞానం బోధించమని వేడుకుంది. కానీ, బాహ్యస్మృతి లేని ఆ యోగి ఆమె మాటలను ఆలకించలేదు. అది అవమానంగా భావించిన ఆమె.. ఆ యోగి ఒక మాతంగుని కడుపున పునర్జన్మించేలా కుట్ర పన్నింది. ఫలితంగా యోగి, మాతంగుడై పుట్టి, ఎనిమిదేళ్ల వయసు వాడయ్యాడు.







# తస్మాత్ జాగృత జాగృత!

అనుసృజన: **నేతి సూర్యనారాయణ శర్మ**

మాతంగుడు అవతలి ఒడ్డున చిక్కుబడిపోయాడు. అతని భార్య గుడిసెముందు దీపం పెట్టి మగని రాకకోసం ఎదురు చూస్తున్నది. అప్పటివరకూ చీకటిపడేలోపుగా భర్త తిరిగి వచ్చేస్తాడని ధైర్యంతో ఉన్న ఆమెలో.. అంతకంతకూ ఆదుర్దా పెరగసాగింది. వీధి చివరి వరకు వెళ్లి చూసి, మగడు కనిపించక నిరాశగా వెనుదిరిగి వచ్చింది.

బయటి అరుగుమీదనే కూర్చుని..

''మా ఇంటాయన కనిపించాడా ?'' అని దారిన పోతున్న వాళ్లను అడగసాగింది.

ఆమె ఆరాటం చూసి, పిల్లవాడు బయటికి వచ్చాడు.

''అమ్మా! నాన్నకోసం ఇంత పరితపిస్తున్నావు దేనికి? నేడు కాకపోతే రేపు వస్తాడు కదా!'' అని అడిగాడు.

తల్లి కొడుకుని ఎత్తుకుని ముద్దాడుతూ..

''నాయనా! మీ నాన్న ఈ రాత్రికి గస్తీ తిరగాల్సి ఉంది. ఏ కారణం చేతనో రాలేకపోయినాడు. మూడుతరాల నుంచి మనకు గస్తీ తిరుగుతున్నందుకు మాన్యం వస్తున్నది. ఈవేళ మానేస్తే మాన్యం లాగేసుకుంటారు. అందుకే విచారిస్తున్నాను'' అన్నది.

''అమ్మా! గస్తీ అంటే ఏమిటి?'' అని అడిగాడు.

''బాబూ! ప్రజలందరూ నిద్రపోతుండగా రాత్రి నాలుగు జాముల్లోనూ నాలుగు వీధులకూ పోవాలి. డప్పు వాయిస్తూ.. 'ఇంటిలో దొంగలు దూరి వస్తువులు దొంగిలించుకుని పోగలరు. జాగ్రత్తగా మేలుకుని ఉండండి!' అని కేక పెట్టాలి. దానికే గస్తీ అని పేరు'' అని చెప్పింది తల్లి.

వారిద్దరి మధ్య సంభాషణ ఇలా కొనసాగింది.

''ఆ మాత్రం పని నేను చేయలేనా?! నన్ను పంపించరాదా!''.

''నాయనా! నువ్వు ఇదివరకు ఎన్నడూ ఇల్లు కదిలి ఎరగవు. చీకటిలో కొత్త వీధులకు ఎలా పోగలవు?! జడుసుకున్నావంటే భూతాలు సోకగలవు. మాన్యం పోతే పోయింది కానీ, నీకా పని వద్దులే తండ్రీ!''.

''అమ్మా! నాకేమీ భయం లేదు. డప్పు వాయించగలను. ఏ వీధులకు పోవాలో గుర్తులు చెప్పు. వెళ్తాను!''.

''ఒకపని చేద్దాం. నేను కూడా వస్తాను. కానీ నువ్వు బిగ్గరగా కేక వేయగలవా? అని సందేహంగా ఉంది''.

''మరేమీ పరవాలేదమ్మా. వెళదాం పద!'' అన్నాడు పిల్లవాడు.

కోటలో పదిగంటలు కొట్టారు. తల్లీ కొడుకులిద్దరూ బయల్దేరారు. పిల్లవాడు చేతిలో డప్పు పట్టుకున్నాడు. తల్లి పిల్లవాణ్ని ఎత్తుకుని, ఒక చేతిలో కర్ర పట్టుకున్నది.

''అమ్మా! నన్ను కిందికి దింపు. నేను నడవగలను'' అన్నాడు పిల్లవాడు.

కానీ తల్లి ఒప్పుకోలేదు.

''నాయనా! నువ్వు నాకు భారమవుతావా?! ఈ చీకటిలో నిన్నెలా నడిపించగలను?!'' అన్నది.

కోటకు తూర్పున ఉన్న వీధికి తీసుకుపోయి, ఒకచోట కొడుకుని దించింది. తాను కొద్దిసేపు డప్పు వాయించి..

''నాయనా! 'దొంగలున్నారు జాగ్రత్తండోయ్. పారాహుషార్!' అని అరువు'' అని చెప్పింది.

అప్పుడు ఆ కుర్రవాడు ఒక శ్లోకం చదివాడు.

**''కామః క్రోధశ్చ లోభశ్చ దేహే తిష్ఠంతి తస్కరాః**
**జ్ఞానరత్నాపహారేణ తస్మాత్ జాగృత జాగృత**

..ఓ జనులారా! కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే ఆరుగురు దొంగలు నీ దేహమనే ఇంటి ముందు తిరుగుతున్నారు. ఆ దొంగలు నీ జ్ఞానమనే రత్నాన్ని దొంగిలించుకుని పోగలరు. జాగ్రత్తగా ఉండు. ఇకనైనా మేలుకో!''.. అని అరిచాడు.

''నాయనా! నేను చెప్పినట్లు కాకుండా వేరేదో చదువుతున్నావు. ఈ చదువు నీకెలా వచ్చింది?'' అని ఆశ్చర్యపడిన తల్లి, అంతలోనే తనకుతానే సర్దిచెప్పుకుని..

''అయినా కొత్తమాటలు చెప్పకూడదు. 'దొంగలు పడగలరు. మేల్కొని ఉండండి!' అని కేకలు పెట్టు'' అన్నది.

''అమ్మా! నువ్వు చెప్పిన మాటలే నేను మరోలా చెప్పాను!'' అన్నాడు కుమారుడు.

తల్లి ఎలాగో సరిపుచ్చుకుని రెండోజాములో దక్షిణపు వీధికి తీసుకుపోయింది. ఒకచోట కొడుకుని కిందికి దించి, డప్పు వాయించింది. పిల్లవాణ్ని కేకపెట్టమన్నది.

అప్పుడతను మరో శ్లోకం చదివాడు.

**''మాతానాస్తి పితానాస్తి నాస్తి బంధుః సహోదరః**
**అర్థంనాస్తి గృహంనాస్తి తస్మాత్ జాగృత జాగృత**